క్లుప్తంగా

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

బండోనిగూడ మాజీ సర్పంచ్ కుమార్



విజేత టీమ్

నందిగామ: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బండోనిగూడ మాజీ సర్పంచ్ జెట్ట కుమార్ అన్నారు. మండల పరిధిలోని బండోనిగూడలో గ్రామానికి చెందిన పసుల బుచ్చయ్య, జెట్ట కుమార్ ఆర్థిక సహాయంతో నిర్వహించిన బండోనిగూడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి జెట్ట కుమార్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, యువత కేవలం చదువు మాత్రమే కాకుండా తమకు ఇష్టమైన క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఫైనల్‌లో ఆర్‌సీబీ, ముంబై టీమ్‌లు తలపడగా ఆర్‌సీబీ టీం విజయం సాధించింది. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు ప్రశాంత్, రవి, రాజ్‌కుమార్, మాణిక్యం, చందు, నందు, తేజ, చింటు, కార్తీక్, భరత్, మచ్చేందర్, కుమార్, భాను, అరవింద్, సాయికిరణ్, దుర్గాప్రసాద్, మహేశ్, తరుణ్, శివనంద్, శ్రీశైలం, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ఇళ్లపై నుంచి వేలాడుతున్న తీగలు

కొత్తూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో పలు వీధుల్లో ఇళ్లపై నుంచి వేసిన విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికే ఆయా వీధుల్లో పలువురు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. కాగా కిందకు ఉన్న తీగలను సరిచేయాలని పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయాలని వారు కోరుతున్నారు.

చెరువుల్లో పూడికను తొలగించాలి

కొత్తూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో చెట్లు, మట్టితో నిండుకున్న చెరువుల్లో పూడికను తొలగించాలని ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులను మత్స్యకారులు కోరారు. గత ప్రభుత్వంలో మిషన్ కాకతీయలో భాగంగా పలు చెరువుల్లో పూడిక తీసినట్లు పేర్కొన్నారు. కాగా మిగిలిన చెరువుల్లో గత కొన్నేళ్ల నుంచి పూడిక తీయని కారణంగా నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుందన్నారు. దీంతో చేపల పెంపకంతో పాటు వ్యవసాయ అవసరాలకు నీరు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు.

ఘనంగా మాజీ సర్పంచ్ జన్మదిన వేడుకలు



మాజీ సర్పంచ్ శ్రీధర్‌తో కేక్ కట్ చేయిస్తున్న మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: పట్టణ మాజీ సర్పంచ్ బిసోళ్ల శ్రీధర్ జన్మదిన వేడుకలను శనివారం పట్టణంలోని బీపీఆర్ గ్రౌండ్‌లో మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌కు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఏర్పడక ముందు శంకర్‌పల్లి సర్పంచ్‌గా శ్రీధర్ ఎన్నో రకాల మంచి పనులు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పిల్లలను సర్కార్ బడికి పంపండి

ఆమనగల్లు: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని నుచ్చుగుట్టతండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సామ సునీతారెడ్డి కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి తండాలో శనివారం బడిబాట నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సర్కారు బడుల్లో చిన్నారులకు నాణ్యమైన విద్య అందుతుందని హెచ్ఎం వివరించారు.

తీరనున్న విద్యుత్ సమస్య

- ముర్తూజగూడలో 33కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు నిధులు మంజూరు
- వేగంగా జరుగుతున్న నిర్మాణ పనులు
- రెండునెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం



ముర్తూజగూడలో జరుగుతున్న 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు

మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీరనున్నాయి. లో ఓల్టేజీ లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కొత్తగా మరో 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాగా ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ముర్తూజగూడలో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు రెండు నెలల్లో పూర్తి కానున్నాయి.

మొత్తం 6 సబ్‌స్టేషన్లు..

మొయినాబాద్ మున్సిపాలిటీ, మండల పరిధిలో మొత్తం ఆరు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో మొయినాబాద్, అజీజ్‌నగర్ సబ్‌స్టేషన్లు ఉండగా.. మండల పరిధిలో కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, అమ్డాపూర్, రెడ్డిపల్లిలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఈ ఆరు సబ్‌స్టేషన్ల నుంచే మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. గత కొంత కాలంగా మొయినాబాద్ ప్రాంతంలో ఫాంహౌస్‌లు, రిసార్ట్స్ పెరగడంతో విద్యుత్ వినియోగం సైతం పెరిగింది. దీంతో కొన్నిసార్లు లో ఓల్టేజీ సమస్యలు వస్తున్నాయి. అప్పుడప్పుడూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. దీనిని అధిగమించేందుకు విద్యుత్‌శాఖ కొత్తగా 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి విన్నవించింది. మున్సిపాలిటీలోని ముర్తూజగూడ, చిలుకూరు గ్రామాల్లో 33 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ముర్తూజగూడలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వ భూమి కేటాయించడంతో పాటు సుమారు రూ.8 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. చిలుకూరులో ప్రభుత్వ భూమిని పరిశీలించినా ఇంకా కేటాయింపు జరగలేదు.

మరో రెండు నెలల్లో..

ముర్తూజగూడ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో నెలరోజుల క్రితమే పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం వేగంగా పనులు జరుగుతున్నాయి. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులతో పాటు 33 కేవీ విద్యుత్ లైన్ పనులు సైతం కొనసాగుతున్నాయి. మరో రెండు నెలల్లో సబ్‌స్టేషన్ అందుబాటులోకి రానుంది.

సబ్‌స్టేషన్‌లపై తగ్గనున్న భారం

33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీరుతాయి. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే మొయినాబాద్, అజీజ్‌నగర్, అమ్డాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లపై భారం తగ్గుతుంది. దీంతో లో ఓల్టేజీ సమస్య పూర్తిగా తీరుతుంది. ఈ సబ్‌స్టేషన్ నుంచి ముర్తూజగూడ, ఎన్కేపల్లి, బాకారం, కాశీంబౌలి, నజీబ్‌నగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా అందించనున్నారు.

త్వరగా అందుబాటులోకి తేవాలి

కొత్తగా ముర్తూజగూడలో 33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించడంతో పరిసర గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య తీరుతుంది. రైతులకు అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతుంది. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టి త్వరగా అందుబాటులోకి తేవాలి.

–పెంటారెడ్డి, ముర్తూజగూడ, మొయినాబాద్ మున్సిపాలిటీ



విద్యుత్ వినియోగం పెరిగింది

హైదరాబాద్ నగరానికి అతి చేరువలో ఉన్న మొయినాబాద్ ప్రాంతంలో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. ఈ ప్రాంతంలో రిసార్ట్స్, ఫాంహౌస్‌ల నిర్మాణంతో కొత్త కనెక్షన్లు పెరుగుతున్నాయి. విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా అవసరం ఉంటుంది. అందుకే కొత్తగా 33 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటు జరుగుతుంది. ప్రస్తుతం ముర్తూజగూడ సబ్‌స్టేషన పనులు జరుగుతున్నాయి. చిలుకూరు సబ్‌స్టేషన్‌కు భూమి కేటాయింపు పూర్తికాలేదు. – హమునాయక్, విద్యుత్ ఏఈ, మొయినాబాద్

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్



మండల నాయకులతో మహేందర్

కేశంపేట: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చెవెళ్ల మహేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో మండల అధ్యక్షురాలు రొల్ల రాధిక ఆధ్వర్యంలో మండల కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మహేందర్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గూర్చి క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై విరివిగా చర్చించాలన్నారు. గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి వాటిని అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యం, సబ్సిడీ ఎరువులపై ప్రజలకు తెలియజేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం మండల కార్యవర్గ కమిటీని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు కుమ్మరి మహేశ్, పార్టీ మండల మాజీ అధ్యక్షులు రొల్ల రఘురాంగౌడ్, లింగయ్య, శివాజీ, మధుసూదన్‌గౌడ్, ఉదయ్‌గౌడ్, శ్రీనివాస్, యుగేంధర్, నరేందర్‌రెడ్డి, నర్సింలు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. రోడ్డుపై పరుగు

యాచారం: మురుగు కాల్వల్లో పారాల్సిన వ్యర్థ జలాలు.. రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. ఫలితంగా తీవ్ర దుర్వాసనతో పాటు.. వాహనదారులు, ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నానక్‌నగర్ గ్రామంలోని డ్రైనేజీ మొత్తం ఇప్పటి వరకు సమీప వ్యవసాయ పొలాల్లోకి వెళ్లేది. ప్రస్తుతం వరి పంట చేతికొచ్చే సమయం కావడంతో.. వ్యర్థాలను పొలాల్లోకి రానీయకుండా రైతులు అడ్డుకట్ట వేశారు. దీంతో మూడు రోజులుగా డ్రైనేజీ ప్రధాన రోడ్డుపై పరుగులు తీస్తుండగా.. గ్రామస్తులతో పాటు మాల్, యాచారం కేంద్రాలకు వెళ్లే తాడిపర్తి, కుర్మిద్ద తదితర గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

రైతులతో గ్రామస్తుల వాగ్వాదం

డ్రైనేజీని పంట పొలాల్లోకి రాకుండా జేసీబీతో మట్టి పోసి అడ్డుకట్ట వేసిన రైతులతో శనివారం గ్రామస్తులు తీవ్ర వాగ్వాదం చేశారు. ఇన్నాళ్లు డ్రైనేజీ సమస్య ఉండేది కాదని, ఇప్పుడు ఇలా అడ్డుకోవడంతో ఇబ్బంది పడుతున్నామని వాపోతుండగా.. మరి కొద్ది రోజుల్లో వరిని కోస్తామని, ఇలా మురుగు జలాలను పారిస్తే పంట కోయడానికి కష్టంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. 'డ్రైనేజీని మా వ్యవసాయ పొలాల్లోకి పారిస్తే.. పంటలు సాగు చేసుకోక వృథాగా ఉంచుకోవాలా' అని గ్రామస్తులను రైతులు ప్రశ్నించారు. ఇదే విషయమై మాజీ సర్పంచ్ పెద్దయ్య.. మండల పంచాయతీ అధికారి శ్రీలతకు ఫోను ద్వారా ఫిర్యాదు చేశారు.

పీడీల సమస్యలు పరిష్కరించాలి

సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి పీడీల సంఘం నాయకుల వినతి



వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో పనిచేసే పీడీ(ఫిజికల్ డైరెక్టర్స్)ల సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని పీడీల సంఘం నాయకులు కోరారు. శనివారం నగరంలోని వేం నరేందర్‌రెడ్డిని మోడల్ స్కూళ్ల పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజనేయులు ఆధ్వర్యంలో నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడల్ స్కూల్‌లో గత 12 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయినా ఇప్పటివరకు ఉద్యోగ భద్రత లేదని, సకాలంలో వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. జీఓ 254 ప్రకారం న్యాయం చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రధాన నాయకులను కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరామన్నారు. ఈ సందర్భంగా ఆయన సమస్యలు విని సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్ల: బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, చేవెళ్ల ఇన్‌చార్జి అందె బాబయ్య అన్నారు. మున్సిపాలిటీలో శనివారం మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అందె బాబయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ హాజరయ్యారు. ముందుగా పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీర మరణం పొందిన వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. కొత్తగా మున్సిపాలిటీ ఏర్పాటు కావటంతో మున్సిపాలిటీ పరిధిలో ఒకరు, రూరల్‌కు ఒకరు పార్టీ అధ్యక్షులను ఏర్పాటు చేశామన్నారు. మండల కమిటీలో పదవుల కోసం ఆసక్తి ఉన్నవారి పేర్లను ఈ సమావేశంలో సేకరించారు. వారిలో ఎవరు ఏఏ పదవులకు ఎంపిక చేయాలనే విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ప్రకటిస్తామని వెల్లడించారు. రాబోయే రోజులు బీజేపీయేనని, పార్టీ కోసం పనిచేసే వారిని పార్టీ ఎప్పటికీ మరిచిపోదన్నారు. ప్రతిపక్ష పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు వెంకటేశం, నర్సింహారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ కుమార్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు అంజనేయులుగౌడ్, జయశంకర్, ఉమాశంకర్‌రెడ్డి, బర్ల కృష్ణ, ధనుష్‌రెడ్డి, సందీప్, తిరుపతిరెడ్డి, కృష్ణ, మధు, మోహన్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, ఆయా గ్రామాల బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నేడు నృసింహుడి కల్యాణం

ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

- భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి



స్వామివారు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ రాతికి స్వయంభువుగా వెలసిన శ్రీ లక్ష్మీనృసింహ స్వామి జయంతి, కల్యాణోత్సవాలను ఘనంగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, శ్రీ విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రుత్విక్‌కరణం, అంకురార్పణ, శ్రీ సుదర్శన నరసింహ హోమం, ధ్వజారోహనం, మహానివేదన, విష్ణు సహస్రనామ పారాయణం, అష్టోత్తర అర్చన, అమ్మవారి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నిత్య పూజ కైంకర్యములు, శ్రీ లక్ష్మీనృసింహస్వామి మహాయాగం, అభిషేకం, మద్యాహ్నిక ఆరాధన, లఘు నివేదన అనంతరం రాత్రి 7.30 నిమిషాలకు స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేసింది.

భక్తుల కొంగు బంగారం

సుమారు నాలుగు శతాబ్దాల చరిత్ర కలిగిన పురాతన ఆలయం.. గడిచిన పదేళ్లుగా దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రశాంతమైన ప్రకృతి వాతావరణంలో ఈ ఆలయం ఉండటంతో పాటు, కోరిన కోర్కెలు తీర్చే నృసింహుడిగా భక్తుల విశ్వాసం పొందారు. దీంతో స్వామివారి సన్నిధికి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా.. హైదరాబాద్ నుంచి భక్తజనం తరలివస్తుంటారు. ఇదిలా ఉండగా.. ఇబ్రహీంపట్నానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఓ గుట్టకున్న రాతికి స్వామివారు స్వయంభువుగా వెలిశారు. ఈ గుట్టపై స్వామితో పాటు శివాలయం, శ్రీసీతారాములు, అనంత పద్మనాభ స్వామి, అళ్వారుల ఆలయం ఉండటం విశేషం. సోమవారం ప్రత్యేక పూజలు, రథోత్సవం, ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి.

రాజ్యాధికారంతోనే అభివృద్ధి

- జాతీయ బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న జాతీయ బీసీసేన నాయకులు

షాద్‌నగర్‌రూరల్: బీసీలు రాజ్యాధికారం సాధించినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని జాతీయ బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్, దేవునిపల్లి గ్రామాల్లో జాతీయ బీసీ సేన మహిళా విభాగం మండల అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో బీసీ సేన మహిళా విభాగం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సుధాకర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి హాజరై మాట్లాడుతూ.. బీసీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, ఉపాధి రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. జనాభా ధమాషా ప్రకారం బీసీలకు రావాల్సిన హక్కులు, రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయే తప్పా వారి కష్టాలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. వెనుకబడిన తరగతుల సమగ్ర అభివృద్ధి, సంక్షేమమే బీసీసేన లక్ష్యమన్నారు. అనంతరం జాతీయ బీసీ సేన మహిళా విభాగం నూతన గ్రామ కమిటీలు ఎన్నుకున్నారు. చించోడ్ గ్రామ కమిటీ అధ్యక్షురాలుగా వడ్ల సుజాత, ఉపాధ్యక్షురాలిగా చాకలి కల్పన, కార్యదర్శులుగా గుంటి రంగమ్మ, శకుంతల, కోశాధికారిగా సుమలత, దేవునిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా కటిక శోభ, ఉపాధ్యక్షురాలిగా భాగ్య, ప్రధాన కార్యదర్శులుగా మంగలి సంతోష, శశికళ, కోశాధికారిగా సునీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా నియమితులైన వారికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీసీసేన నాయకులు జూపల్లి చంద్రశేఖర్, మేకల వెంకటేశ్, చెన్న బాల్‌రాజ్, ప్యాట జయశ్రీకాంత్, స్రవంతి, వసంత, శారద, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

ఆమనగల్లు: రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని బ్లాక్ కాంగ్రెస్ ఆమనగల్లు ఉపాధ్యక్షుడు ఎంఏ ఖలీల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత ఏర్పాటు చేసిన రైతులకు భోజన వసతి కార్యక్రమాన్ని శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతుల కోసం చైర్‌పర్సన్ భోజన వసతి కల్పించడం హర్షదాయకమన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధరతో పాటు సన్నాలకు బోనస్ తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, రవీందర్, కాంగ్రెస్ నాయకులు రఫీ, పర్వతాలు, రాగ్యానాయక్, ఖాదర్, మహేశ్, రహీం, ఖరీం, విజేందర్ తదితరులు ఉన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

కడ్తాల్: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధి అన్మాస్‌పల్లి గ్రామ వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం సేనావత్ లక్ష్మణ్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఫల పంచామృత అభిషేకం, సింధూర ధారణ, పత్ర పూజలు, నాగవల్లి, ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రతం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు రాంచందర్‌నాయక్, శ్రీను, కృష్ణయ్య, రాజుగౌడ్, కేశవులు, అనిల్, శేఖర్, అంజయ్య, జగన్‌గౌడ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



షాద్‌నగర్: వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

షాద్‌నగర్: పట్టణంలోని రెడ్‌రోజ్ ఫంక్షన్ హాలులో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మళయాలస్వామి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఎఫ్‌సీఎన్ ఫౌండేషన్‌లోని అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నవోదయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. భారత్–పాక్ యుద్ధంలో మృతి చెందిన భారత్ అమర జవానులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, సయ్యద్ హఫీజ్, కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, నాయకులు పాల్గొన్నారు.

పూజించిన చోటే.. ప్రశాంతత

గ్రామ దేవతలను మర్చిపోవద్దు

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: దేవతామూర్తులను పూజించిన చోట ప్రశాంతత ఉంటుందని, ప్రజలు సంతోషంగా ఉంటారని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధి మల్కీజ్‌గూడ గ్రామంలో వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులు నిర్మించిన శ్రీ మార్కమ్మ, ఎల్లమ్మ దేవాలయాల్లో శనివారం దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో గ్రామ దేవతలకు అనేక ప్రాధాన్యత ఉంటుందని, గ్రామ ప్రజలను రక్షించే శక్తి గ్రామ దేవతలకే ఉంటుందని పేర్కొన్నారు. ఆలయాల నిర్మాణంలో ప్రజలు ఐక్యంగా ఉండాల ని సూచించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో పురాతన ఆలయాలు ఉన్నాయని, సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి వాటి పునఃనిర్మాణం కోసం నిధులు వచ్చేలా చూస్తానని తెలి పారు. అనంతరం పార్టీ శ్రేణులతో మాట్లాడారు. ఫ్యూచర్‌సిటీ ప్రాంతంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయో.. ఉండవో.. త్వరలో స్పష్టత వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, అమృతాసాగర్ పాల్గొన్నారు.